క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

బొల్లాపల్లి : మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బండ్లమోటు ఎస్‌ఐ జి.రవికృష్ణ హెచ్చరించారు. వినుకొండ మండలం నరగాయపాలెంకు చెందిన పి.అబ్రహాం మద్యం సేవించి వాహనం నడుపుతుండగా మండల కేంద్రంలో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఇతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి యు.రామ్మోహన్ రూ.10వేలు అపరాధ రుసుము విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహన యజమానులు నిబంధనలు పాటించాలని అన్నారు. తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనయజమానులు ఇది గుర్తించాలని ఎస్‌ఐ సూచించారు.

ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి చూపాలి

శావల్యాపురం: వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతలు ఆరుతడి పంటలు సాగుకు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు సూచించారు. శనివారం మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురంలో రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటల సాగు రైతులందరు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించాలన్నారు. ఆరుతడి పంటలైన కంది, మినుము, చిరుధాన్యాల పంటలు సాగు చేయటం ద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గుతాయని దిగుబడులు వస్తాయన్నారు. వీఏఏలు డి.స్రవంతి, వెంకయమ్మలు రైతులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై కేసు

నాదెండ్ల: ద్విచక్రవాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ఒడిషా యువకుడు మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన కనహైదాస్ (35) అనే కార్మికుడు సీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న పాత ఇనుము దుకాణంలో కూలీగా పని చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సినిమాహాలు రోడ్డులో తన ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతూ సడన్ బ్రేక్ వేయటంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా ఉన్న రమ్య స్పిన్నింగ్ ప్రహరీను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుమారు రెండు నెలల క్రితమే మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి ఇరువురు సంతానం కాగా ప్రస్తుతం వీరు ఒడిషాలోని స్వగ్రామంలోనే ఉంటున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చిలకలూరిపేటటౌన్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ ఎస్‌ఐ మోహన్ కథనం ప్రకారం పట్టణంలోని వైఎస్సార్ కాలనీ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానస్పందంగా కనిపించిన బొలేరో వాహనంలో రేషన్ బియ్యం నిల్వ ఉంది. 65 బస్తాల్లో రేషన్ బియ్యం నరసరావుపేటకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ క్రమంలో వాహన డ్రైవర్ ఎం వితేష్ అదుపులోకి తీసుకొని బియ్యంను పౌరసరఫరాలశాఖ అధికారులకు స్వాధీనం చేశారు.

చిన్నారులను బడిలో చేర్పించాలి

శావల్యాపురం: బడి బయట ఉన్న చిన్నారులందరు బడిలో చేర్పించాలి ఎంఈవో పుసులూరి లలితాకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలో గతంలో బడి బయట చిన్నారులు 1174 మందిని గుర్తించగా ప్రస్తుతం 664 మంది చిన్నారులకు చేరిందన్నారు. ఆయా గ్రామాల్లోని వలంటీర్ల సహకారంతో గ్రామసచివాలయ వేల్ఫేర్ ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలన్నారు. సదస్సులో సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి చర్యలు

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న పాలవెల్లువ పురోగతి పెంపుదల, పాల ఉత్పత్తిదారులకు రుణాల మంజూరుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు సోముల గుణధీర్, పాలపర్తి గణేష్ కుమార్, ఏపీయం జి.వాసుబాబు, ఈవోపిఆర్‌డి పి.సుగుణ, సీసీలు ఖాజావలీ, బేబిరాణి, రమాదేవి, సొసైటీ సీఈవోలు జాలాది నాగప్రసాదు, వెంకట నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, వీవోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. 12 శాతం ఫ్యాట్,ఎస్ఎన్ఎఫ్ 9శాతం ఉన్న పాలకు ఒక్కో లీటరుకు రూ.88 రూపాయలు ప్రభుత్వ మంజూరు చేస్తుందన్నారు. పాడి రైతులకు ఆన్‌లైన్ విధానంలో మెరుగైన పారదర్శకంగా అందించుతుందన్నారు. నాణ్యత కల్గిన అమూల్ దాణా కట్టల 50 కేజీల సంచి రూ. 1300లకు అందజేస్తుందన్నారు. సొసైటీ బ్యాంకు సారథ్యంలో జిల్లాలో రూ. 50 కోట్లు రుణాలు ఇవ్వటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పాడి రైతులు మరింత అభ్యున్నతికి ప్రభుత్వ పరంగా ఒక్కో రైతుకు రూ. 30 నుంచి ఒక లక్ష 60 వేల వరకు రుణాలు ఇవ్వటానికి రంగం సిద్ధం చేసిందని, 7 శాతం వడ్డీ రేటుకు సొసైటీ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తాయన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయానికి కట్టుబడి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పరిశీలకులు జియావుద్దీన్, నాయకులు

సచివాలయ కన్వీనర్లకు దిశ నిర్దేశం చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, రాజకీయ పరిశీలకులు జియావుద్దీన్

నరసరావుపేట: ప్రభుత్వ పథకాలను పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రతి గడపకు తీసుకెళ్లాలనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి తనతో పాటు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం సాయంత్రం జమిందారు ఫంక్షన్‌హాలులో నిర్వహించిన సచివాలయ కన్వీనర్ల ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా నాయకులకు ప్రాధాన్యత తగ్గిందనే విమర్శలో నిజం లేకపోలేదన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు ఇన్‌చార్జీలకు రూ.10 లక్షల ప్రమాద బీమా పార్టీ కల్పిస్తుందన్నారు. రెండు పాస్ పోర్టుసైజు ఫొటోలు, జిరాక్స్ కాపీలు ఇస్తే బీమా పొందవచ్చన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పరిశీలకులు జియావుద్దీన్ మాట్లాడుతూ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ నాయకులు పదులసంఖ్యలో హామీలు ఇస్తున్నారని, గత చరిత్ర పరిశీలిస్తే అవేమి అమల్లోకి వచ్చే అవకాశమే లేదన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే గోపిరెడ్డిని గెలిపించి హ్యాట్రిక్ సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళితే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, నరసరావుపేట, రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, పిల్లి ఓబుల్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్.సుజాతాపాల్, ఇయం.స్వామి, వడ్డెర సంక్షేమసంఘ జిల్లా సభ్యుడు వేముల శివ, రొంపిచర్ల ఎంపీపీ గడ్డం వెంకటరావు, రొంపిచర్ల, నరసరావుపేట మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు మాతృభాషపై పట్టుసాధించాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి



క్విజ్ పోటీల్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు మాతృబాషపై పట్టు సాధించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఈనెల 29వ తేదీన తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు తెలుగుభాషపై క్విజ్‌పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ వ్యావహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాష దినోత్సవంగా నిర్వహించుకుంటామని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో పిల్లలు ఆంగ్ల మాధ్యమంపై ఆసక్తి చూపిస్తున్నారని, అయితే మాతృభాషను మరువవద్దని సూచించారు. నిజ జీవితంలో వాడుకభాషలో తెలుగుభాష ఇమిడి ఉందన్నారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై దృష్టిపెట్టి సమభావంతో చూడాలని సూచించారు. పోటీలలో విజతలుగా నిలవడం, బహుమతులు తీసుకోవడం ముఖ్యం కాదని పాల్గొనడం ప్రధానమన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి తక్కువ సమయంలో క్విజ్ పోటీలకు విద్యా ర్థులను ఎంపికచేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. మొత్తం పది జట్లును ఏర్పాటు చేసి తెలుగుభాషపై వంద ప్రశ్నలను సందించారని తెలిపారు. ఒక్కొక్క గ్రూపులో ఐదు మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనడం విశేషమన్నారు. చివరి రౌండ్ తర్వాత జిల్లా కలెక్టర్ మరోక రౌండ్ నిర్వహించి విద్యార్థుల్లో ఉత్సాహన్ని నింపేలా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ఈ నెల 29వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందిస్తామని తెలిపారు. క్విజ్ పోటీలో 24 మార్కులతో వినుకొండ ప్రథమస్థానం, 22 మార్కులతో గురజాల ద్వితీయస్థానం, 20 మార్కులతో నరసరావుపేట నియోజకవర్గం తృతీయస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్యూల్, డిప్యూటి విద్యాశాఖాధికారి వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టంట్ లేకుండా యాంజియాప్లాస్టీ

- డీసీబీ విధానం అమలు చేసిన మహాత్మాగాంధీ హాస్పిటల్
- వివరాలు వెల్లడించిన హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని



పేషెంట్‌తో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: గుండెనొప్పితో బాధపడుతూ హాస్పిటల్‌కు వచ్చిన 58 ఏళ్ల ఉపాధ్యాయుడికి మెట్రో నగరాలకే పరిమితమైన స్టంట్‌లేకుండా అరుదైన యాంజియాప్లాస్టీ నిర్వహించి వ్యాధి నయం చేసినట్లు మహాత్మాగాంధీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శనివారం వైద్యశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను తెలియచేశారు. కృష్ణ మోహన్ అనే ఉపాధ్యాయుడు 12 గంటలపాటు ఛాతినొప్పితో బాధపడుతూ హాస్పిటల్‌కు రాగా, పరీక్షలు నిర్వహించి అతను గుండెనొప్పితో బాధపడుతున్నట్లుగా గుర్తించామన్నారు. యాంజియోగ్రామ్ చేసి చూడగా ఒక రక్తనాళం మూసుకుపోయిందన్నారు. అతడికి యాంజియోగ్రామ్ చేసే సమయంలో స్టంట్ అమర్చకుండా డ్రగ్ కోటెడ్ బెలూన్ (డీసీబీ) ద్వారా ఐవీయుఎస్ సహాయంతో చికిత్స చేశామన్నారు. ఈవిధానం కేవలం మెట్రో నగరాలకే పరిమితమన్నారు. స్టంట్ వేయకుండా యాంజియోప్లాస్టీ నిర్వహించటం వలన రక్తనాళం మళ్లీ మూసుకుపోయే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. దీంతో పాటు రక్తం పలుచబడటానికి ఇచ్చే మందులు తక్కువ మోతాదులో తక్కువ సమయం వరకే వాడవచ్చన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో భోజనం స్వీకరిస్తున్న కమిషనర్

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించటంతో పాటు ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామమోహన్ తెలిపారు. పెదచెరువులోని శ్రీజవహర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శనివారం కమిషనర్ రామమోహన్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం క్రింద విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం స్వీకరించారు. గుడ్డు నాణ్యతను పరిశీలించి నాణ్యతలేని వాటిని తిరిగి పంపాలని తెలిపారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు గోరుముద్ద అందుతున్నదీ, లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన తాజా పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందివ్వాలని తెలిపారు. గోరుముద్దలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరగతి గదిలో విద్యాబోధనను పరిశీలించిన కమిషనర్ రామమోహన్ విద్యార్థులను ప్రశ్నించి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆదర్శనీయురాలు మదర్‌థెరిస్సా

నాదెండ్ల: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని ప్రపంచానికి చాటి సేవామూర్తిగా ప్రఖ్యాతిగాంచిన మదర్‌థెరిస్సా అందరికీ ఆదర్శనీయమని హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. అనంతరం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కె.కోటేశ్వరరావు, రత్నరాజు, పీఈటీ జాస్తి శ్రీకాంత్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): అబ్దుల్ కలామ్ థెరిసా సేవా సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నిర్మలా హైస్కూల్‌లో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సొసైటీ ఫౌండర్ చందోలు నాగవాణి మాట్లాడుతూ మదర్ థెరిస్సా సమాజానికి చేసిన సేవలు మరువలేనివని, తన జీవితాన్ని పేద ప్రజలకు అంకితం చేసుకొని అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో సిస్టర్ సిద్ధార్థి, సిస్టర్ కాస్పర్, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠు నియంత్రణపై సమీక్ష సమావేశం

నరసరావుపేట: కుష్ఠువ్యాధి మచ్చ రూపంలో ఉన్నప్పుడే నిర్ధారించి చికిత్స తీసుకుంటే పూర్తిగా వ్యాధి నయమవుతుందని, అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చునని జిల్లా లెప్రసీ, క్షయ వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ కె.పద్మావతి వివరించారు. లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పల్నాడు రోడ్డులోని పాత ఏరియా వైద్యశాలలోని జిల్లా కార్యాలయంలో శనివారం నెలవారి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డేటా ప్రొటెక్షన్ అధికారుల పనితీరుని సమీక్షించారు.

జిల్లాకు ఐదు 'జనరిక్' దుకాణాలు మంజూరు

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో జిల్లాకు నూతనంగా ఐదు జనరిక్ మందుల దుకాణాలు మంజూరైనట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దుత్తా సుజాత పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం శావల్యాపురలో సొసైటీ వారి ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న జనరిక్ మందుల దుకాణ గదిని పరిశీలించారు. నాణ్యమైన మందులు అతి తక్కువ ధరకు ప్రభుత్వ నిబంధనలు మేరకు అందుబాటులోకి వస్తాయన్నారు.

పాల వెల్లువ కార్యక్రమంపై అవగాహన

- సభ్యులకు రుణాలిచ్చేందుకు గుర్తించండి
- ఎంపీడీవో హనుమారెడ్డి
- యడ్లపాడులో అవగాహన సమావేశం

యడ్లపాడు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై పశుసంవర్ధక, వైఎస్సార్‌క్రాంతి సిబ్బందికి అవగాహన సమావేశం జరిగింది. ఎంపీడీవో వై హనుమారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన జగనన్న పాలవెల్లువ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు ఇచ్చే ప్రాధాన్యాలు వివరించారు. ఆయా సంఘాల్లో సభ్యులకు పసుకిసాన్ కార్డుల ద్వారా పావలా వడ్డీకి రూ. 50వేలు, కొత్తగా గేదె కొనుక్కునే వారికి రూ. 91,170 వరకు రుణాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామ సంఘ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను సంసిద్ధులను చేయాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను ఈనెల 29 నాటికి చిలకలూరిపేట ఏఈఈఈకు సమర్పించాలన్నారు.

సెప్టెంబర్ ఒకటిన ఆయా అర్జీలను పరిశీలించి అర్హులను గుర్తిస్తామన్నారు. అదేనెల 4వ తేదీన రుణమేళ నిర్వహించేలా ప్రణాళిక చేసినట్లు తెలిపారు. యడ్ల పాడు, సొలస, లింగారావు పాలెం డిజిటల్ అసిస్టెంట్లు సంఘ కార్యకర్తలకు జగనన్న పాల వెల్లువ మహిళా డైరీలో నమోదైన వారి వివరాలను గ్రామ సంఘ కార్యకర్తలకు ఇవ్వాలని నిర్ణయించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు పట్టణానికి చెందిన పాలిమేర వెంకటరెడ్డి, విజయకుమారి దంపతులు రూ.1,00,000లు విరాళంగా అందజేసారు. గుంటూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా విరాళం మొత్తాన్ని ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి అందించారు.

సంక్షేమ పథకాల అమలుపై సర్వే

బొల్లాపల్లి: మండలంలోని సచివాలయాల పరిధిలో సిటిజన్ ఔటరీచ్ ప్రోగ్రామ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో అండ్‌పీఆర్‌డీ జి. శ్రీహరి మాట్లాడుతూ నెలలో చివరి వారంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం ద్వారా ఆయా గ్రామసచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల అమలు తీరుపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు. సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించడంతో పాటు ఏ మేరకు అమలయ్యేయో తెలుసుకోవడం జరుగుతుందన్నారు.

నేటి ఆలయ పునఃప్రతిష్ఠ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెంలో రోడ్డులోని శ్రీ పోతురాజు స్వామి సహిత అంకాలమ్మ తల్లి నూతన విగ్రహ, దేవస్థానం పునః ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు ఈనెల 27 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరణ

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 27న నరసరావుపేటకు రానున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రచారజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడుతూ బస్సుయాత్ర ఈ నెల 27న నరసరావు పేటకు వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు తానం మత్తయ్య, మధుసూదనరావు, తిమ్మరాజు, ప్రజానాట్యమండలి కళాకారులు షేక్ చిన జాన్ సైదా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం అందించారు

చిలకలూరిపేటటౌన్: పేదలకు, అనాధలకు అపన్న హస్తం అందించిన మహోన్నత వ్యక్తి మదర్ థెరిస్సా అని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. శనివారం మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డి.మనోజ్‌కుమార్, ఆదినారాయణరెడ్డి, చెంచుపున్నయ్య, సుబ్రమణ్యం, భాస్కరరెడ్డి, నాగేశ్వరరావు, పుల్లయ్య పాల్గొన్నారు.

సంక్షేమం దరిచేరాలి

వినుకొండ(నూజెండ్ల): గ్రామాల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని నూజెండ్ల ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన నూజెండ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామసచివాలయ సిబ్బందితో పాటు అధికారులు కృషి చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్య మెరుగుకు దృష్టిసారించాలన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఈపూరు ప్రభుత్వ వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ
- సిబ్బంది తీరుపై ఆగ్రహం



వైద్యశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: ప్రజలకు సేవచేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్పష్టం చేశారు. మండల కేంద్రమైన ఈపూరు ప్రభుత్వ వైద్యశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధునిక వైద్యపరికరాలు ఆస్పత్రికి తీసుకొచ్చినప్పటికీ వాటిని ఇంకా వినియోగంలోకి తీసుకురాకపోవడం ఏమిటని స్థానిక వైద్యులపై అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడా లేని విధంగా ఈపూరు వైద్యశాలలో వివిధ పరీక్షలు నిర్వహించేందుకు అత్యాధునిక యంత్రాలు ఉన్నప్పటికీ వాటి విలువ మీకు తెలియడం లేదని, ఆసుపత్రిలో పెట్టుకొని చూసుకోవడానికా వీటిని తీసుకొచ్చింది, వీటిని వినియోగంలోకి తెచ్చుకునే బాధ్యత మీకు లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. సంవత్సరాలు గడుస్తున్నా సిబ్బంది పనితీరు మార్చుకోవడం లేదని, ఇలాగే ఉంటే ఇకపై చర్యలకు వెనుకాడబోమన్నారు. వైద్యశాల పనితీరుపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినితో, డీఎంఅండ్‌హెచ్‌వోతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఎక్స్‌రే మిషన్ కూడా సరిగా పనిచేయకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వెంటనే వచ్చి మరమ్మతులు చేయడానికి పూనుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే నా దృష్టికి తీసుకురావాలని, పేద ప్రజలకు ఉపయోగపడే వైద్యశాలను గాలికి వదిలేయవద్దన్నారు. అనంతరం రూ.6 కోట్ల నిధులతో అత్యాధునికంగా నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవనాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నిసదుపాయాలతో ఈ భవనం అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వైద్యరంగం ముందుకు వెళుతుందని, ఆధునిక పరిజ్ఞానంతో, నూతన వైద్యవిధానంతో నూతన భవనంలో అన్ని వసతులు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, పార్టీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల హనుమయ్య, ఈపూరు సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, వైద్యశాల కమిటీ మెంబరు మందపాటి రామారావు, కుందుర్తి శ్రీనివాసరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలతో వైద్యసేవలు మరింత చేరువ

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ఎల్.శివశంకర్
- నూతన పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ



పీహెచ్‌సీ కేంద్ర నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే

నరసరావుపేట: గర్భిణులు, బాలింతలకు చేరువలో వైద్యసేవలు అందజేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దచెరువు ఒకటోలైనులో సుమారు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. నరసరావుపేటకు రెండు అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రాలను కేటాయించడం జరిగిందన్నారు. గత నెలలో ఆరోవార్డు బాబాపేటలో ఒక కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని, ఇప్పుడు రెండోదానికి భూమిపూజ చేశామన్నారు. దీనిని వచ్చే జనవరి నాటికి పూర్తిచేసి స్థానిక ప్రజలకు సేవలు అందిచేందుకు సిద్ధం చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, క్షయ, లెప్రసీ వ్యాధి నిరోధక జిల్లా అధికారి డాక్టర్ కె.పద్మావతి, జిల్లా వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీ.వీ.రంగారావు, తహసీల్దారు ఆర్‌వీ రమణానాయక్, మున్సిపల్ ఎంఇ డి.శ్రీనివాస రావు, డీఇ ఓ.శ్రీనివాస రావు, ముదిరాజు, గిరిజన, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వర రావు, కందుల ఎజ్రా, పట్టణ బీసీసెల్ అధ్యక్షులు అచ్చిశివకోటి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని విమర్శించే స్థాయా మీది?

నల్లపాటి వ్యాఖ్యలను ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు



విలేకర్ల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసరావుపేట: రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ దక్షిణ కోస్తా జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని విమర్శించే నైతిక హక్కు టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారిపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. విమర్శించే ముందు తమస్థాయి ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. ముదిరాజు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఇయం.స్వామి మాట్లాడుతూ టీడీపీ నాయకులవి చౌకబారు విమర్శలుగా పేర్కొన్నారు. బీసీలపై ఎక్కడ దౌర్జన్యాలు, అన్యాయాలు జరిగినా తాము కూడా ఖండిస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో బీసీలకు చెందిన 11 మందికి మంత్రి పదవులతో పాటు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఒక్క సంతకంతో 650 మంది నాయకులను తయారు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గన్నవరంలో నారా లోకేష్ మాట్లాడిన మాటలు సభ్య సమాజానికి సిగ్గుచేటన్నారు. నవరత్నాల పథకాలను ప్రచారం చేసి 151 సీట్లు సాధించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మానిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. వంగవీటి మోహన రంగా హత్య కేవలం టీడీపీ పాలనలో.. వారి చలువతోనే జరిగిందనే విషయం లోకానికి ఎరుకేనన్నారు. గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలో ఉండగా కన్ను మిన్నూ కానరాకుండా అవినీతి, ఆశ్రిత పక్షపాతంకు పాల్పడటం ద్వారానే టీడీపీ వారికి 23 సీట్లు కట్టబెట్టారన్నారు. చంద్రబాబుపై వేసిన కేసులను నిజాయతీగా ఎదుర్కోకుండా స్టేలు ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కందుల ఎజ్రా మాట్లాడుతూ విజయసాయి రెడ్డిపై స్థాయికి మించి అనుచిత వ్యాఖ్యలు బాధాకరమైన విషయమన్నారు. ఎదుటి వారిని విమర్శించే సమయంలో మనమేమిటో తెలుసుకొని మాట్లాడాలని నల్లపాటికి సూచించారు. నియోజకవర్గం నుంచి ఎవరు పోటీచేస్తారో ఇప్పటి వరకు ప్రకటించలేని స్థితిలో టీడీపీ ఉందన్నారు. నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాష మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో కేటాక్స్ కడుతూ ప్రజలు చాలా ఇబ్బందిపడ్డారని, ఇప్పుడా సమస్య ఎక్కడా లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులకు ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే గోపిరెడ్డి న్యాయం చేస్తున్నారన్నారు. పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేటను తీసుకొచ్చిన ఘనత గోపిరెడ్డికే దక్కుతుందన్నారు. మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహనరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు నిర్వహించలేకపోవడానికి టీడీపీ నాయకులు కోర్టులను ఆశ్రయించటమే కారణమన్నారు. జియో ఫైబర్ పనులు పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వ హయాం నుంచే జరుగుతున్నాయన్నారు. సమావేశంలో 33వ వార్డు నాయకుడు మద్రిపూడి రాంబాబు మాట్లాడారు.

పంటకోత ప్రయోగాలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): పంట కోత ప్రయోగాలపై నూజెండ్ల రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారిణి షేక్ సుగుణాబేగం ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆర్‌బీకే పరిధిలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద పంట కోత ప్రయోగాలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను గ్రామ యూనిట్‌గా ఎంపిక చేసి పంట కోత ప్రయోగాలు చేపట్టడం జరిగిందన్నారు. పంట కోత ప్రయోగాల్లో వచ్చిన దిగుబడి ఆధారంగా బీమా పథకం అమలు పరచడం జరుగుతుందన్నారు. ఈ ప్రయోగాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి సహాయ గణాంక అధికారి (ఏఎస్‌వో) కె. నాగశ్రీనివాసరావు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు చేయడానికి ప్లాట్ ఎంపిక, సర్వే, సబ్ డివిజన్ నంబరు ఎలా ఎంపిక చేయాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పంట కోత ప్రయోగాలకు సంబంధించిన ఫారం –1, 2 నిర్ణీత సమయంలోనే జిల్లా కార్యాలయానికి పంపాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో ఎల్.ఎలీషా, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు రెండో ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.హనుమంతయ్య శనివారం తెలిపారు. ఈనెల 28వతేది నుంచి సెప్టెంబర్ ఒకటో తేది వరకు రెండో ఫేజ్ అడ్మిషన్ల దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. తమ కళాశాలలో బీఏ ఆనర్స్‌లో చరిత్ర మేజర్ సబ్జెక్ట్, ఆర్థిక శాస్త్రం మైనర్ సబ్జెక్ట్‌తో బిఏ కోర్సు ఉందన్నారు. అలాగే బీకాం ఆనర్‌లో కంప్యూటర్ అప్లికేషన్స్ మేజర్, ఆర్థిక శాస్త్రం మైనర్‌గానూ, బీఎస్సీ ఆనర్స్‌లో కంప్యూటర్ సైన్స్ మేజర్, గణిత శాస్త్రం మైనర్‌గానూ, జంతు శాస్త్రం మేజర్, వృక్ష శాస్త్రం మైనర్‌గానూ డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొదటి ఫేజ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన తమ విద్యార్థులకు అందించబడుతుందని స్పష్టం చేశారు. డిగ్రీ కోర్సుల విద్యా బోధనతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు. పల్నాడు జిల్లా విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.